సాక్షి శ్రీకాకుళం

శనివారం । 25 । జనవరి । 2025

I

పండగ ఆదాయం రూ.కోటి



శ్రీకాకుళం అర్బన్: సంక్రాంతి పండగ సందర్భంగా జిల్లాలోని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, శ్రీకాకుళం రెండు డిపోలతో పాటు టెక్కలి, పలాస తదితర నాలుగు డిపోల ఆర్టీసీ బస్సుల ద్వారా దండిగా ఆదాయం సమకూరింది. ఈ ఏడాది ఆర్టీసీకి రూ.1 కోటి 4లక్షల 51వేలు ఆదాయం వచ్చింది. ఈనెల 10వ తేదీ నుంచి 21వ తేదీ వరకూ 579 బస్సులను 2లక్షల 61వేల కిలోమీటర్లు నడిపి 67, 800 మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.వి జయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోలతో పాటు టెక్కలి, పలాస తదితర నాలుగు డిపోల డీఎంలు కండక్టర్లను, డ్రైవర్లను సమన్వయం చేసుకుని అదనంగా బస్సులను వేసి ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చారని, సహకరించిన కండక్టర్లకు, డ్రైవర్లకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

న్యూస్‌రీల్

ఉత్తమ ఎలక్టోరల్ ఆఫీసర్‌గా కలెక్టర్‌కు అవార్డు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఎలక్టోరల్ అధికారిగా జిల్లా ఎన్నికల అధికారి (డీఈఓ), కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఎంపికయ్యారు. ఈ 2024 ప్రత్యేక ఓటర్ల సమ్మరీలో ఎక్కువ సేవలు అందించినందుకు, ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నందుకు కలెక్టర్‌కు నూతన ఓటర్ల దినోత్సవం సందర్భంగా అవార్డు ఇవ్వనున్నారు. ఆయనతో పాటుగా జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమ్మరీలో ఉత్తమ సేవలు అందించిన మరో నలుగురికి ఈ అవార్డులు దక్కనున్నాయి. కలెక్టర్‌తో పాటు శ్రీకాకుళం మండలం తహసీల్దారు (ఎఈఆర్‌వో), ఇద్దరు బీఎల్‌ఓలు, పలాస అసెంబ్లీ నియోజవర్గంలోని బీఎల్‌ఓ ఐ.నీలవేణి, శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గంలోని బీఎల్‌ఓ వంజరాపు జగన్నాథరావు, కలెక్టరేట్ సి సెక్షన్ టెక్నికల్ సపోర్టర్ ఎం.సత్యనారాయణలు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. వీరికి శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమంలో అవార్డులు ప్రదానం చేయనున్నారు.

కొత్తమ్మ తల్లి హుండీ ఆదాయం లెక్కింపు

టెక్కలి: కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఆలయ హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ సీనియర్ అసిస్టెంట్ జీవీబీఎస్ రవికుమార్, ఆలయ కార్య నిర్వహణాధికారి వి.రాధాకృష్ణ పర్యవేక్షణలో హుండీ లెక్కింపు చేపట్టారు. సుమారు 55 రోజులకు రూ.3,61,145 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో గ్రామపెద్ద బి.గోవిందరాజుతో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కల్లు గీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: నూతన మద్యం పాలసీలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లో పది శాతం మద్యం దుకాణాలను అంటే 16 దుకాణాలను గీత కార్మికులకు కేటాయించారు. లాటరీ విధానంలో నిర్వహించిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు జిల్లా అధికారు సీహెచ్ తిరుపతినాయుడు, సీఐ ఎంవీ గోపాలకృష్ణ పాల్గొన్నారు. గొడ కులస్తులకు ఇచ్ఛాపురం రూరల్ మండలంలోనూ, శ్రీశయన కులస్తులకు ఇచ్ఛాపురం పురపాలక సంఘం, సరుబుజ్జిలి, ఆమదాలవలస పురపాలక సంఘం, కవిటి, వజ్రపుకొత్తూరు, బూర్జ, నందిగాం, పాతపట్నం, మందస, పోలాకి, సెగిడి కులస్తులకు టెక్కలి, కంచిలి, కొత్తూరు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ, యాత కులస్తులకు హిరమండలంలను కేటాయించారు.

ఆదిత్యుని హుండీ కానుకల ఆదాయం రూ.66.89 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ.66,89,389 లభించినట్లు ఆలయ ఈఓ వై.భద్రాజీ తెలియజేశారు. శుక్రవారం ఆలయ మండపంలో నిర్వహించిన కానుకల లెక్కింపులో నగదు రూపంలో రూ.63,88,254, చిల్లర రూపంలో రూ.3,01,135 లభించిందని, అలాగే 58 గ్రాముల బంగారం, 2 కేజీల 137 గ్రాముల వెండి వస్తువులు లభించాయన్నారు. గత ఏడాది నవంబర్ 19 నుంచి ఈనెల 23 వరకు హుండీల్లో లభించిన కానుకలను లెక్కించినట్లుగా ఈఓ తెలిపారు.

స్నోయగాలు







తెరలు తెరలుగా పొగ మంచు ఊళ్లన్నీ కప్పేస్తోంది. బారెడు పొద్దెక్కినా వెలుగు కనిపించనీయకుండా వీర విహారం చేస్తోంది. శుక్రవారం ఉదయం 8 గంటలు దాటినా దారులన్నీ తెల్ల దుప్పటి కప్పినట్లు మసకగా కనిపించాయి. చూసేందుకు ఆహ్లాదంగానే అనిపించినా.. వేకువజామున పనుల మీద వెళ్లే వారికి మాత్రం తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

శ్రీసూర్యనారాయణా.. మేలుకో!



- ఆక్రమణకు గురైన దేవస్థానం భూమి
- దేవస్థానం భూమిలో లేఅవుట్ కోసం రోడ్డు నిర్మాణం
- దేవస్థానం భూములకు ఆనుకుని ఉన్న ఇరిగేషన్ కాలువపై అక్రమంగా వంతెన నిర్మాణం
- అనుమతుల్లేకుండానే నిర్మాణాలు
- దేవస్థానం హెచ్చరిక బోర్డును తొలగించి రోడ్డు వేసిన అక్రమార్కులు



ఈ ఫొటో చూడండి. అనధికారికంగా అరసవల్లి దేవస్థానం భూముల్లో రోడ్డు వేశారని తెలుసుకుని దేవదాయ శాఖ అధికారులు అక్కడికెళ్లి...ఈ భూమి అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి దేవస్థానానికి చెందినది. ఆక్రమణదారులు శిక్షార్హులని బోర్డు పెట్టిన దృశ్యమిది.



ఇరిగేషన్ కాలువపై అనుమతి లేకుండా నిర్మించిన వంతెన ఇది. అవతల భూముల్లో లేఅవుట్ వేసేందుకు, దానికి రహదారి కోసం నిర్మించిన వంతెన ఇది. దీనికి ఎలాంటి అనుమతుల్లేవని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. అరసవల్లి దేవస్థానానికి కూత వేటు దూరంలో ఉన్న వాడాడ పంచాయతీ పరిధిలో గల కాలువపై వంతెన నిర్మించారు.



ఆ వంతెనకు కలుపుకుని కొత్తగా నిర్మించిన రోడ్డు ఇది. ఇది కూడా అక్రమంగానే వేశారు. అరసవల్లి దేవస్థానం భూములను ఆక్రమించి రోడ్డు వేసేశారు. విలువైన భూమిని అవతల ఉన్న తమ లేఅవుట్ కోసం రోడ్డుగా మార్చేశారు.

ఈ ఫొటో చూడండి. ఆక్రమణదారులు శిక్షార్హులని దేవాదాయ శాఖాధికారులు పెట్టిన బోర్డును పీకేసి యథేచ్ఛగా చదును చేసి, అక్రమంగా రోడ్డేసిన దృశ్యమిది. అక్రమార్కుల బరితెగింపునకు నిదర్శనమిది.



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

అరసవల్లి ఆదిత్యుడి భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. అవతల ఉన్న లేఅవుట్ భూముల కోసం దేవస్థానం భూముల్ని ఆక్రమించి రోడ్డు వేసేశారు. సర్వే నంబర్ 130లో గల 0.873 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూమిలోని కొంత భాగంలో ఈ రోడ్డు నిర్మించారు. అంతేకాదు ఇరిగేషన్ అధికారుల అనుమతి లేకుండా దేవస్థానం భూముల పక్కనే ఉన్న ఇరిగేషన్ కాలువపై అడ్డంగా, అక్రమంగా వంతెన కూడా నిర్మించారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో, సూర్యనారాయణస్వామి దేవస్థానానికి దగ్గర్లోనే ఈ భూ బాగోతం చోటు చేసుకుంది. ఆ వ్యక్తులు అంతటితో ఆగడం లేదు. నిర్మించిన వాటికి అనుమతులివ్వాలని కాలువ అవతల జిరాయితీ భూములున్న వ్యక్తులతో దరఖాస్తులు చేయించడం చర్చనీయాంశమవుతోంది.

ఇరిగేషన్ కాలువ అవతల ఉన్న భూముల్లో లేఅవుట్ వేసి లబ్ధిపొందేందుకు పన్నిన పన్నాగమిది. అలాగని, ఆ కాలువ అవతల ఉన్న భూములకు రోడ్డు లేకపోవడం వల్ల ఈ వంతెన నిర్మించి, రోడ్డు వేశారనుకుంటే అదీ కాదు. కాలువ అవతల భూములకు పక్కా రోడ్డు ఉంది. అటువైపు పండిన పంటలను తరలించేందుకు ఆ రోడ్డును ఇప్పటికే వినియోగిస్తున్నారు. దేవస్థానం భూమిలో వేసిన రోడ్డు, ఇరిగేషన్ కాలువపై నిర్మించిన వంతెన కేవలం రియల్ ఎస్టేట్‌కు మాత్రమే ఉపయోగపడుతోంది. ఇదంతా పక్కా పథకం ప్రకారం జరిగింది. దీనివెనక ఎవరున్నారో వారికి ఎవరి అండదండలు ఉన్నాయో తేలాల్సిన అవసరం ఉంది. అధికార పెద్దల హస్తం లేకుండా అంతగా బరితెగించే అవకాశం లేదని చర్చ జరుగుతోంది.



వంతెనకు ఆనుకుని ఉన్న అరసవల్లి దేవస్థానం భూములు

అనుమతుల్లేకుండా వంతెన నిర్మాణం

ఇరిగేషన్ కాలువపై వంతెన నిర్మాణానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. అక్రమంగా నిర్మించిన వంతెనపై చర్యలు తీసుకుంటాం. తహసీల్దార్‌తో కలిసి పరిశీలించి వంతెన కట్టడంపై చర్యలు చేపడతాం. ఇరిగేషన్ కాలువలపై ఇటువంటి అక్రమ కట్టడాలు చేపడితే చర్యలు తప్పవు.

– పొన్నాడ సుధాకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, జల వనరుల శాఖ

పోలీస్ కేసు పెట్టాం..



అరసవల్లి ఆలయానికి చెందిన భూమిలో అక్రమంగా లేఅవుట్‌కు రహదారి నిర్మాణం మా దృష్టికి వచ్చింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరాను. ఇక అక్కడ కల్వర్ట్ కట్టడం కూడా నిబంధనలకు విరుద్ధమే. ఆలయ భూముల పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం.

– వై.భద్రాజీ, ఆలయ ఈఓ

ఉద్దానం ఒడిలో ఒదిగిన సుధన్న

ఉద్దానం చేత 'సుధన్నా..' అంటూ ఆప్యాయంగా పిలిపించుకున్న చలపతి ఆఖరి మజిలీకి మళ్లీ ఇక్కడకే చేరుకున్నాడు. ఒకనాడు బొడ్డపాడులో అందరి బంధువులా కలిసిపోయిన పోరాట వీరుడు అలసిసొలసి ఆ ఊరి నడిబొడ్డునే మృతదేహమై పడుకున్నాడు. ఎక్కడైతే గొంతు పగిలేలా నినాదాలు వినిపించడం మొదలుపెట్టాడో అక్కడే నిశ్శబ్దంగా నిర్జీవంగా కనిపించి కన్నీరు పెట్టించాడు. చిత్తూరు జిల్లా ఆయనకు జన్మనిచ్చినా.. ఉద్దానం అమ్మలా ఆదరించింది. ఆఖరకు ఆ తల్లి ఒడికే వచ్చాడు. బతుకంతా అలుపెరుగని పోరాటం సాగించి సిక్కోలు మట్టిలో కలిసిపోయాడు. మావోయిస్టు అగ్రనేతగా ఎదిగిన చలపతి అంత్యక్రియలు బొడ్డపాడులో జరిగాయి.

- బొడ్డపాడులో మావోయిస్టు అగ్రనేత చలపతి అంత్యక్రియలు
- మృతదేహాన్ని చూసి ఘొల్లుమన్న ఉద్దానం
- 'సుధన్న' పేరుతో ఈ ప్రాంతానికి చలపతి చిరపరిచితుడు



చలపతి మృతదేహానికి అత్తా మామల నివాళి



చలపతి (ఫైల్)

పలాస: ఒడిశా–చత్తీస్‌గఢ్ సరిహద్దులో జరిగిన ఎదురు కాల్పుల్లో మృతి చెందిన మావోయిస్టు నాయకుడు రామచంద్రా రెడ్డి ఉరఫ్ ప్రతాపరెడ్డి అలియాస్ చలపతి అలియాస్ సుధన్న భౌతిక కాయానికి పలాస మండలం బొడ్డపాడులో శుక్రవారం అంత్యక్రియలు జరిగాయి. రాయ్‌పూర్ ప్రభుత్వ ఆస్పత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి అమరుల బంధుమిత్రుల కమిటీ తరఫున ప్రత్యేక వాహనంలో మృతదేహాన్ని తీసుకునివచ్చారు. ముందుగా బొడ్డపాడు గ్రామంలో అతని అత్త పోతనపల్లి సాయమ్మ, అలాగే విశాఖపట్నానికి చెందిన మామ లక్ష్మణరావు నివాళులర్పించారు. అనంతరం అతని ఉద్యమ సహచరుడు, ఉద్దానం పీపుల్స్ వార్ నిర్మాత అక్కుపల్లి గ్రామానికి చెందిన మద్దు బాబూరావు కూడా నివాళులర్పించారు. ఆ తర్వాత అంజమ్మ అధ్యక్షతన సంతాప సభ జరిగింది. ఈ సభలో అంజమ్మతో పాటు సీఎల్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు చిలుకా చంద్రశేఖర్, పీడీఎం వై.వెంకటేశ్వర్లు, వివిధ ప్రజాసంఘాల నాయకులు ఉద్దానం ప్రాంతంతో చలపతికి ఉన్న అనుబంధాన్ని వివరించారు. అనంతరం చలపతి మృతదేహాన్ని గ్రామంలో ఊరేగిస్తూ శ్మశాన స్థలం వద్దకు తీసుకొని వెళ్లి అంత్యక్రియలు చేపట్టారు.

రుక్మిణి.. మూడోతరం విప్లవకారిణి



రుక్మిణి

పలాస: మావోయిస్టు నేత చలపతి మరణంతో ఆయన భార్య రుక్మిణి త్యాగాన్ని అందరూ గుర్తు చేసుకుంటున్నారు. శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధపోరాటంలో పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన మొత్తం 11 మంది అమరవీరులు కాగా ఆ గ్రామానికి చెందిన తెలుకల సరస్వతి ఆనాటి పోరాటంలో అమరురాలైంది. ఆ తర్వాత అదే గ్రామానికి చెందిన పోతనపల్లి పారమ్మ అలియాస్ చిట్టమ్మ శ్రీకాకుళం పోరాటంలో పాల్గొని అనంతరం పీపుల్స్‌వార్‌లో చేరి 20 ఏళ్ల క్రితం గొట్టా గ్రామంలో పోలీసు ఎదురు కాల్పుల్లో మృతి చెందింది. అనంతరం 1990లో శ్రీకాకుళం పోరాట అమరవీరుల జ్ఞాపకార్థం నిర్మితమైన అమరవీరుల స్మారక మందిరం భవనం ప్రారంభోత్సవం నాడు గ్రామస్తులు తలమునకలై ఉండగా అదే రాత్రి రుక్మిణితో పాటు సుభద్ర అనే యువతి కలిసి ఇద్దరు పీపుల్స్ వార్ ఉద్దానం దళంలోకి చేరిపోయారు. అప్పటి నుంచి రుక్మిణి వారి ఇంటికి తిరిగి రాలేదు. కొద్ది రోజులకే చలపతి అలియాస్ సుధన్నతో ఆమెకు వివాహమైంది. సుధన్న ఉద్దానం ప్రాంతంలోకి 1988లో వచ్చి 1996 వరకు ఈ ప్రాంతంలోనే ఉన్నాడు. అప్పుడే ఈ ప్రాంతంలో అనేక ఉద్యమాలు జరిగాయి. అ నంతరం పోలీసు నిర్బంధం ఎక్కువ కావడంతో ఒడిశా సరిహద్దు ప్రాంతానికి తన మకాం మార్చాడు. అయితే రుక్మిణి మాత్రం దండకారణ్యంలోనే ఉంటూ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. అలాగే సుభద్ర కూడా ఎన్‌కౌంటర్‌లో మృతి చెందింది. తన తండ్రితో పాటు ఆనాటి శ్రీకాకుళం ఉద్యమంలోకి వెళ్లి 20 ఏళ్ల క్రితం పోలీసులకు పట్టుబడిన పోతనపల్లి అప్పలస్వామి అలియాస్ కుమారన్న భార్య జయమ్మ కూడా తన ఇంటి వద్దనే అనారోగ్యంతో మృతి చెందారు. ఈమె మొదటి తరం విప్లవకారిణి. ఈ విధంగా ఈ గ్రామంలో మూడు తరాలకు చెందిన విప్లవకారులు ఉన్నారు. రుక్మిణి సోదరులు ఒకరు పోలీస్ కానిస్టేబుల్ కాగా మరొకరు సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ కావడం గమనార్హం.

రథసప్తమి వేడుకల నిర్వహణకు స్పాన్సర్స్ కావలెను..!

- వ్యాపారులను కోరిన జిల్లా యంత్రాంగం
- శుక్రవారం సాయంత్రం వ్యాపారులతో సమావేశం
- ప్రతీ సారీ చేసిన విధంగా కాకుండా అంతకుమించి చేయాలని విజ్ఞప్తి
- వేడుకల చరిత్రలో ఇలా కోరడం తొలిసారి అని చర్చించుకున్న వ్యాపారులు



సమావేశానికి హాజరైన వ్యాపారులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: రథ సప్తమి వేడుకలకు స్పాన్సర్ చేయాలని చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా తొలిసారిగా నగరంలోని వ్యాపారులను జిల్లా యంత్రాంగం కోరింది. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం వివిధ వ్యాపార వర్గాలను పిలిచి జాయింట్ కలెక్టర్, కార్పొరేషన్ కమిషనర్ సమావేశమయ్యారు. ఒక్కో వ్యాపార రంగానికి చెందిన వారితో మాట్లాడారు. రథ సప్తమి వేడుకలను ఈ సారి రాష్ట్ర పండుగగా మూడు రోజులు పాటు నిర్వహిస్తున్నామని, మీ సహకారం అవసరమని కోరారు. నగరంలో స్వాగత ద్వారాలు, ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్న కారణంగా స్పాన్సర్స్ అవసరమని వివరించారు. నిధుల లభ్యత తక్కువగా ఉన్న కారణంగా 'సహకరించాలని' విజ్ఞప్తి చేశారు. దీనికి సంబంధిత వ్యాపార వర్గాలు స్పందిస్తూ ఏటా తాము తమ శక్తి మేరకు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, పులిహోర పంపిణీ, డ్రింక్స్ పంపిణీ, అన్నదానం వంటి కార్యక్రమాలతో పాటు వివిధ శాఖలకు అవసరమైనవి సమకూర్చుతున్నామని వివరించారు. 'ప్రతిసారీ చేస్తున్నవి ఓకే... అంతకుమించి ఏం చేస్తారో' చెప్పాలని అధికారులు కోరారు. ఏం అవసరమో చెబితే మా వ్యాపార సంఘ సభ్యులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని వ్యాపారులు చెప్పారు. కాకపోతే, రథసప్తమి వేడుకలకు స్పాన్సర్స్‌ను అడగడం తొలిసారి అని, గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదని వ్యాపారులు అనుకోవడం చర్చనీయాంశమైంది.

తమ్ముళ్ల తిరుగు బాటు

అధికార పార్టీలో అసంతృప్త గళం వినిపిస్తోంది. కూటమి పార్టీలు కలిసే ఉన్నట్టు కనిపిస్తున్నా.. కడుపులో కత్తులు పెట్టుకుని నాయకులు కౌగిలించుకుంటున్నారని క్షేత్రస్థాయి కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. లావేరులో టీడీపీ కార్యకర్తలు ఏకంగా మండలాధ్యక్షుడిపై ప్రెస్‌మీట్ పెట్టి మరీ విమర్శలు చేశారు. కూటమి నాయకులకు గౌరవం లేదని బాహాటంగానే ప్రకటించారు. ఎమ్మెల్యే, ఎంపీలు కూడా నియంతృత్వ నాయకులనే ప్రోత్సహిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు.

- లావేరు టీడీపీ మండలాధ్యక్షుడు సురేష్‌కు వ్యతిరేకంగా సమావేశం
- పీఏసీఎస్ నామినేటెడ్ పోస్ట్ అర్హులకు ఇవ్వాలని డిమాండ్



సమావేశంలో పాల్గొన్న కీలక కూటమి నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: లావేరు మండలం టీడీపీ అధ్యక్షుడు ముప్పిడి సురేష్‌కు వ్యతిరేకంగా లావేరు మండలంలోని 16 పంచాయతీలకు చెందిన నాయకులు లావేరులో శుక్రవారం సమావేశం నిర్వహించారు. లావేరు మండల పీఏసీఎస్ అధ్యక్ష పదవి కూనబిల్లి దామోదర్‌రావుకి ఇవ్వాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు చోటు చేసుకుంటాయని హెచ్చరించారు. ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి సురేష్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, మిగతా కూటమి నాయకులకు కనీస ప్రాధాన్యత ఇవ్వడం లేదని విమర్శించారు. అయితే వీరంతా బహిరంగంగా ప్రెస్‌మీట్ పెట్టి విమర్శించడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. పనులు, పదవులు సురేష్ చెబితేనే కేటాయింపులు జరుగుతున్నాయని, ఇలా జరిగితే పార్టీ మండలంలో తీవ్రంగా నష్టపోతుందని వీరు స్పష్టం చేశారు. కూటమి ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు దృష్టికి అనేక సార్లు తీసుకు వెళ్లినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ, ఎమ్మెల్యే నియంతృత్వ నాయకుడిని ప్రోత్సహిస్తున్నారని దుయ్యబట్టారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని సురేష్ దోపిడీ చేస్తున్నారని అన్నారు. ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ పనులు సైతం సురేష్ ఏకపక్షంగా తనకు నచ్చిన వారికే ఇచ్చుకున్నారని అన్నారు. త్వరలో సురేష్ వ్యవహార శైలి, ఎమ్మెల్యే, ఎంపీ ఆయనకు ఇస్తున్న ప్రాధాన్యతను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు చెప్పారు. సమావేశంలో కూటమి నాయకులు భాజాపా ప్రధాన కార్యదర్శి ఇజ్జాడ శ్రీనివాసరావు, కూనిబిల్లి దామోదర్‌రావు, మాజీ జెడ్పీటీసీ నిడుగంటల త్రినాథరావు, సర్పంచ్ కొన్ని హేమసుందరరావు, లంకపల్లి జగన్నాథదొర తదితరులు పాల్గొన్నారు.

ఒక్క క్లిక్‌తో.. పోలీస్ సమాచారం

- ఎస్పీ చేతుల మీదుగా నూతన వెబ్‌సైట్ ఆవిష్కరణ

శ్రీకాకుళం క్రైమ్ : ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి జిల్లా పోలీస్ నూతన వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్://ఎస్ఆర్‌ఐకెఎకెయుఎల్ఎఎమ్‌పీఒఎల్ఐసీఇ.ఎపీ.జీఒవీ.ఇన్‌ను శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఒకే ఒక్క క్లిక్‌తో జిల్లా పోలీసు శాఖ సమాచారం అందుతుందని, పోలీస్ సేవలు ప్రజలకు మరింత చేరువ కావడానికి, సులువుగా తెలుసుకోవడానికి ఈ వెబ్‌సైట్ ఎంతో ప్రయోజనకారిగా ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు.

రూపకల్పన జరిగిందిలా...

జిల్లాలోని ఎచ్చెర్ల మండలం శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థి, కంచిలి మండలం కేశరపడ గ్రామానికి చెందిన కొరికాన నవీన్ తన ప్రతిభతో ఎస్పీ స్వీయ పర్యవేక్షణలో ఈ వెబ్‌సైట్ రూపకల్పన చేశారు. శ్రీకాకుళం ఎస్ఐసీ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ కిరణ్, పోలీస్ ఐటీ కోర్ సీఐ శ్రీనివాస్, ఏఎస్ఐ రమేష్ సహాయ సహకారాలతో నవీన్ ఈ వెబ్‌సైట్‌ను డిజైన్ చేశారు.



కేశరపడ బీటెక్ విద్యార్థి నవీన్ రూపకల్పన చేసిన వెబ్‌సైట్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

నవీన్‌కు ఎస్పీ ప్రశంసలు..

ఇంజినీరింగ్ విద్యార్థి కొరికాన నవీన్ వెబ్‌సైట్ డిజైనింగ్‌లో కీ రోల్ పోషించినందుకు ఎస్పీ మహేశ్వర రెడ్డి ప్రత్యేకంగా ప్రశంసించారు. అతి కొద్దిరోజుల్లో అందుబాటులో తీసుకొచ్చేలా ఈ వెబ్‌సైట్‌ను మరింత అభివృద్ధి చేయాలని సూచించారు.

వెబ్‌సైట్ సేవలివే..

- ఈ వెబ్‌సైట్ ద్వారా ప్రజలు జిల్లా పోలీసు యంత్రాంగం ప్రాథమిక సమాచారం, వివరాలు, పోలీస్ స్టేషన్లు, అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లు, అత్యవసర సమయాల్లో ఉపయోగపడే ఫోన్ నంబర్లు, స్టేషన్ల భౌగోళిక మ్యాప్‌లు తెలుసుకోవచ్చు.
- గంజాయి, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, క్రైమ్ ఎగైనెస్ట్ ఉమెన్, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై ప్రతిరోజూ ఇతర పోలీస్ అధికారులు వారి వారి పరిధిలో ప్రజల కోసం నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు తెలుసుకోవచ్చు. జిల్లా ప్రజలు ఈ వెబ్‌సైట్‌ను అనుసరించి పోలీస్ యంత్రాంగం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.వి.రమణ, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసరావు, ఐటీకోర్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ కోటేశ్వరరావు, ఏఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఖమ్మంలో కథానిలయం వార్షికోత్సవ సభ

శ్రీకాకుళం కల్చరల్ : కథా నిలయం 28వ వార్షికోత్సవ సభ ఫిబ్రవరి 2న ఖమ్మంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్డులో వేదిక ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు కథానిలయం ట్రస్టు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఉదయం సభా కార్యక్రమం, సాయంత్రం మనమెరుగని లాటిన్ అమెరికా, గోధుమరంగు ఊహ పుస్తకావిష్కరణలు, అనంతరం తెలంగాణా కథ సమాజ కేంద్రకం -వ్యక్తి కేంద్రకం, పరిణామం అనే అంశంపై చర్చావేదిక జరుగుతుందని పేర్కొన్నారు.

స్టేట్‌బ్యాంకులో పొగలు


అల్లుకున్న పొగలు

టెక్కలి రూరల్: స్థానిక పాత బస్టాండ్ వద్ద ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచిలో శుక్రవారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. భారీగా పొగలు రావడంతో సిబ్బంది, ఖాతాదారులు భయంతో బయటకు పరుగులు తీశారు. స్విచ్‌బోర్డులో షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చారు.

ఢిల్లీ పెరేడ్‌కు ఎన్‌సీసీ క్యాడెట్


కొర్నాన ధనలక్ష్మి

శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం రూరల్: జిల్లాకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్ కొర్నాన ధనలక్ష్మి చరిత్ర సృష్టించింది. ఈ నెల 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో 14వ ఆంధ్రా బెటాలియన్ నుంచి పాల్గొననుడటమే కాకుండా.. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి ఈ వేడుకల్లో పాల్గొనే ఎన్‌సీసీ క్యాడెట్‌గా గుర్తింపు పొందింది. గురజాడ విద్యా సంస్థల గాయత్రి కళాశాలలో చదువుతున్న ధనలక్ష్మి ఎన్‌సీసీ కాడెట్ అండర్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ నుంచి ప్రాతినిధ్యం వహించనుంది. ఢిల్లీలో జరిగే పెరేడ్ కోసం బెటాలియన్, గ్రూప్, డైరెక్టరేట్ స్థాయిలో నిర్వహించిన వివిధ ఎంపిక పరీక్షల్లో మెరుగైన ప్రతిభ కనబర్చడంతో ఎంపికైందని మేజర్ వంగ మహేష్ తెలిపారు. ఇప్పటికే ఢిల్లీ చేరుకున్న ఈ యువ ఎన్‌సీసీ క్యాడెట్ రిహార్సల్స్‌లో నిమగ్నమైంది. కాగా కొర్నాన ధనలక్ష్మిని గురజాడ విద్య సంస్థల అధినేత జీవీ స్వామి నాయుడు, 14వ ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ కె.ఎన్.సాహు, పరిపాలన అధికారి కల్నల్ ప్రసూన్‌కుమార్ పండా, విద్య సంస్థల కరస్పాండెంట్ అంబటి రంగారావు, గాయత్రి కళాశాల ప్రిన్సిపల్ పులఖండం శ్రీనివాస రావు, గురజాడ విద్యాసంస్థల సంచాలకులు, సిబ్బంది అభినందించారు.

మీడియా కమ్యూనికేషన్స్ వర్క్‌షాప్‌కు సీదిరి, చింతాడ


వర్క్‌షాప్ వద్ద సీదిరి అప్పలరాజు, చింతాడ రవికుమార్

ఆమదాలవలస: వైఎస్సార్ సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా కమ్యూనికేషన్స్ వర్క్‌షాప్‌కు వైఎస్సార్‌సీపీ మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించినట్లు వారు తెలిపారు.

గడువులోగా చార్జిషీట్ దాఖలు చేయాలి


మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, మహిళలపై జరిగే నేరాల దర్యాప్తులో పురోగతి సాధించి నిర్ణీత గడువులోగా చార్జిషీట్ దాఖలు చేయాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జూమ్ కాన్ఫరెన్సు ద్వారా డీఎస్పీలు, సీఐ, ఎస్‌ఐలతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్, మిస్సింగ్, రోడ్డు ప్రమాదాల కేసుల దర్యాప్తు, విచారణ, కేసు ఫైల్ ప్రస్తుత స్థితి, సాధించిన పురోగతి, సాంకేతిక, ఇతర ఆధారాల సేకరణపై ఆరా తీశారు.

చెట్టును ఢీకొట్టిన కారు

ఎల్.ఎన్.పేట: మండలంలోని శ్యామలాపురం వద్ద అలికాం-బత్తిలి (ఏబీ) రోడ్డుపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. విజయనగరం జిల్లాకు చెందిన ఎం.రామచంద్రరాజు, రవికుమార్‌తో పాటు మరో ఇద్దరు పర్లాకిమిడికి కారులో వెళుతున్నారు. శ్యామలాపురం దాటిన తర్వాత అదుపు తప్పి ఏబీ రోడ్డు పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టారు. డ్రైవర్‌తో పాటు ప్రయాణిస్తున్న మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు స్పందించి క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.




కోటబొమ్మాళి మండలం దుప్పలపాడులో వందేళ్లు చరిత్ర కలిగిన ప్రాథమిక పాఠశాల

టెక్కలి: ఒక విద్యార్థి జీవితంలో ఎంత ఉన్నత స్థానానికి ఎదిగినా.. అందులో ప్రాథమిక విద్యను అందించిన పాఠశాల పాత్ర ఎంతో కీలకమైనది. అక్షర జ్ఞానాన్ని అందించే తొలిమెట్టు ప్రాథమిక బడి. అలాంటి పాఠశాల రేపు వందేళ్ల వేడుక జరుపుకోబోతోంది. కోటబొమ్మాళి మండలం దుప్పలపాడు గ్రామంలో 1925 సంవత్సరంలో బ్రిటీష్ కాలంలో ఓ చిన్నపాటి పూరిగుడిసెలో ఏర్పాటైన ఈ పాఠశాల శత వసంతాల వేడుకకు సిద్ధమైంది. వందేళ్ల చరిత్రకు గుర్తుగా గ్రామ సర్పంచ్ గురువెల్లి భారతి సూర్యప్రకాశ్, వైస్ సర్పంచ్ గురువెల్లి భారతి అప్పన్న, పూర్వపు విద్యార్థులు, గ్రామస్తుల సహకారంతో ఆదివారం శత వసంత వార్షికోత్సవం ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

1925లో ఎయిడెడ్ పాఠశాలగా ఏర్పాటు...

బ్రిటీష్ పాలనలో 1925లో ఏర్పాటైన ఈ పాఠశాలలో వింజాంపాడు గ్రామానికి చెందిన లఖినాన వల్లభయ్యస్వామి మేనేజర్ స్థాయిలో ఉపాధ్యాయునిగా పాఠాలు బోధించారు. అప్పట్లో చుట్టు పక్కలా ఎక్కడా పాఠశాల లేకపోవడంతో 120 మంది విద్యార్థులతో పాఠశాలను ప్రారంభించారు. 1959 వరకు ఎయిడెడ్ పాఠశాలగా కొనసాగించారు.

స్వాతంత్ర్యం రాక మునుపు వరకు వల్లభయ్యస్వామి కుమారుడు రంగనాథంతో పాటు లఖినేని కృష్ణమాచార్యులు, లఖినేని వాసుదేవరావు తదితరులు ఉపాధ్యాయులుగా సేవలు అందజేశారు. వీరిలో రంగనాథం సుమారు 40 ఏళ్లు ఇదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా సేవలు అందజేసి పదవీ విరమణ పొందారు. అనంతరం గురువెల్లి కృష్ణమూర్తిని ఉపాధ్యాయుడిగా నియమించారు. అతను ఉదారంగా గ్రామంలో తన విశాలమైన స్థలాన్ని పాఠశాలకు దానంగా ఇచ్చారు. ప్రస్తుతం ఇదే స్థలంలో పాఠశాలను కొనసాగిస్తున్నారు. ఆ తరువాత జిల్లా పరిషత్ పరిధిలో పాఠశాలను నెలకొల్పారు. ఇప్పటి వరకు సుమారు 37 మంది ఉపాధ్యాయులు ఇక్కడ పని చేయగా సుమారు 1413 మంది విద్యార్థులు విద్యా ఫలాలు అందుకున్నారు. అప్పట్లో పాఠశాల ఏర్పాటు చేసిన స్థలంలో గుర్తుగా రామాలయం నిర్మాణం చేపట్టారు.


వార్షికోత్సవ ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహక కమిటీ సభ్యులు



పాఠశాల వద్ద ఏర్పాటు చేయనున్న పైలాన్

ఉన్నత స్థాయిల్లో పూర్వ విద్యార్థులు...

ఇక్కడ చదివిన వారిలో బొడ్డేపల్లి రామారావు జిల్లా జడ్జిగా పనిచేశారు. కణితి జనార్దనరావు(ఎన్‌ఆర్‌ఐ) కువైట్‌లో స్థిరపడ్డారు. శిగిలిపల్లి కృష్ణారావు ఐఆర్‌ఎస్, పేడాడ దాలినాయుడు ప్రస్తుతం నరసన్నపేట ఎంఈఓగా పనిచేస్తున్నారు. వీరితో పాటు 20 మంది ఉపాధ్యాయులు, 30 మంది త్రివిధ దళాల ఉద్యోగులు, 50 మంది బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులు, రైల్వే, పోలీస్, ఇంజినీర్లు, డాక్టర్లు కలిపి 36 మంది వరకు ఉన్నత స్థానాల్లో ఉన్నారు.

సంతోషంగా ఉంది...



పాఠశాలకు వందేళ్లు పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉంది. పూర్వపు విద్యార్థులు, గ్రామ పెద్దలు, గ్రామస్తుల సహకారంతో శత వసంత వార్షికోత్సవ ఏర్పాట్లు చేస్తున్నాం.

–సీపాన సన్యాసప్పారావు, హెచ్‌ఎం, ప్రాథమిక పాఠశాల, దుప్పలపాడు

పూర్వ విద్యార్థుల ఆలోచనతో...



పాఠశాల వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తోటి పూర్వ విద్యార్థుల ఆలోచనలతో శత వసంత వార్షికోత్సవ కార్యక్రమానికి సిద్ధమయ్యాం. ఉపాధ్యాయులు, గ్రామపెద్దల సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.

– వై.సూర్యనారాయణ, శత వసంత వార్షికోత్సవం ఆర్గనైజర్

శాశ్వతంగా గుర్తుండేలా..



పాఠశాలకు వందేళ్లు గడచిన సందర్భంగా శాశ్వతంగా గుర్తుండిపోయేలా శత వసంత వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నాం. గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులకు అవసరమైన సహకారం అందజేస్తున్నాం.

– గురువెల్లి భారతి, సర్పంచ్, దుప్పలపాడు, కోటబొమ్మాళి మండలం

గర్వంగా ఉంది...



దుప్పలపాడులో మా తాతయ్య వల్లభయ్యస్వామి అంకురార్పణ చేసిన పాఠశాల ఈ రోజు వందేళ్లు పూర్తి చేసుకోనుంది. ఆయన ఆలోచనలకు అనుగుణంగా ఉపాధ్యాయ వృత్తినే ఎంచుకున్నాం. ఇందుకు గర్వంగా ఉంది.

– ఎల్.భువనేశ్వరస్వామి, విశ్రాంత ఉపాధ్యాయుడు, వింజాంపాడు

స్థలం కోసం కూన అనుచరుడి బెదిరింపులు


స్థల పత్రాలతో బాధితుడు వెంకటరమణ

ఆమదాలవలస: బొడ్డేపల్లిపేటకు చెందిన టీడీపీ కార్యకర్త, ఎమ్మెల్యే కూన రవికుమార్ అనుచరుడు బొడ్డేపల్లి విజయ్‌కుమార్ ఆమదాలవలసలో ప్రధాన రహదారిపై వెంకటేశ్వరస్వామి దేవాలయం ఎదురుగా మూడు సెంట్ల స్థలం, రేకుల షెడ్డును కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని స్వర్ణకారుడు పి.వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023 జూన్‌లో భోగి రాజేశ్వరి, సూర్యనంద వద్ద స్థలాన్ని కొనుగోలు చేశానని, అందులో షెడ్డు నిర్మించి అద్దెకు ఇచ్చానని చెప్పారు. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో విజయ్ జేసీబీతో వచ్చి షెడ్డును కూల్చేసి తనపై దాడికి ప్రయత్నించాడని వాపోయారు. ఈ విషయమై ఎస్పీకి ఫిర్యాదు చేయగా ఆయన స్థానిక ఎస్సైను పంపించారని తెలిపారు. అయినప్పటికీ విజయ్ ఫోన్ చేస్తూ బెదిరిస్తున్నాడని, అతనితో ప్రాణహాని ఉందని వాపోయాడు. తనకు న్యాయం చేయాలని కోరాడు.

ఆదిత్య ఐఐసీకి ఫోర్ స్టార్ ర్యాంక్

టెక్కలి: భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ 2023-24 విద్యా సంవత్సరంలో ప్రకటించిన ఐఐసీ ర్యాంకుల్లో టెక్కలి ఐతమ్‌కు 4 స్టార్లు వరించాయని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2018 నుంచి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్‌లో ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ సెల్ (ఐఐసీ) పేరిట ఉద్యోగ, ఉపాధి, ఉత్పాదక రంగాల్లో విద్యార్థులు పురోభివృద్ధి కోసం చేస్తున్న కృషిని అభినందిస్తూ ఏఐసీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ టి.జి.సీతారాం, ఎంఓఈ చీఫ్ ఇన్నోవేషన్ అధికారి డాక్టర్ అభేజెరే, ఎంఓఈ ఇన్నోవేషన్ సెల్ అసిస్టెంట్ డైరెక్టర్ దిప సాహూ ర్యాంకింగ్ ధృవపత్రాన్ని జారీ చేసినట్లు పేర్కొన్నారు.

విచారణ నేటికి వాయిదా

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంతో తొలగించిన 34 ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫిర్యాదుపై శ్రీకాకుళం పట్టణంలోని లేబర్ కార్యాలయంలో శుక్రవారం విచారణ జరగాల్సి ఉండగా శనివారానికి వాయిదా వేశారు. ఫిర్యాదుదారులు, వర్సిటీ అధికారులు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ హాజరు కావాలని సూచించారు. గత నెల 31వ తేదీన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించగా, ఈ నెల రెండో తేదీన ఫిర్యాదు చేశారు. 9న మొదటి సా రి విచారణ జరగ్గా, మళ్లీ 24వ తేదీకి వాయిదా వేశారు. బాధితులు పూర్తి స్థాయిలో తమ నియామకాలు, 151 జీఓ మేరకు తమకు ఉన్న హక్కులు, 12 నెలలు చేసిన పని వంటి వివరాలు అందజేశారు. లేబర్ కోర్టులో కేసు నడుస్తుండగా, ఏపీ హైకోర్టును సైతం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆశ్రయించారు.

ఆధ్యాత్మిక చింతన పెరగాలి


ప్రసంగిస్తున్న పద్మనాభనంద సరస్వతి

కాశీబుగ్గ: ప్రతిఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన పెరగాలని అంతర్జాతీయ దివ్య జీవన సంఘం ఉపాధ్యక్షుడు పద్మనాభనంద సరస్వతి మహారాజ్ అన్నారు. కాశీబుగ్గలో శుక్రవారం ఉభయ తెలుగు రాష్ట్రాల 49వ దివ్య జీవన మహాసభలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ధ్యానం, నగర సంకీర్తన, యోగాసనాలు, గీతాపారాయణం, దివ్య జీవన ధ్వజారోహణం, దీప ప్రజ్వలన, హనుమాన్ చాలీసా పారాయణం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు కె.వి.రామకృష్ణ, అధ్యక్షులు పైడిశెట్టి ఆశోక్‌కుమార్, కార్యదర్శి పంట సత్యనారాయణ, కోశాధికారి కొత్తకోట మురళి, తెలుగు రాష్ట్రాల దివ్య జీవన మహాసభల నిర్వహణ కమిటీ అధ్యక్షులు చిల్ల రామకృష్ణ, కార్యదర్శి చంద్రమౌళీశ్వరరావు, కోశాధికారి నాగేశ్వరరావు, తాళాసు నరసింహమూర్తి, పెంట జనార్ధన, రామలింగస్వామి, దివ్యజీవన సంఘం కార్యవర్గ సభ్యులు, పరిసర ప్రాంతాల స్వామీజీలు పాల్గొన్నారు.

సచ్చిదానంద స్వామీజీకి సత్కారం


నగరంలోని చిం దత్త క్షేత్రానికి విచ్చేసిన మైసూర్ దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీని బలగ బాలత్రిపుర కాలభైరవ పీఠం ప్రతినిధులు గజమాలతో శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా స్వామీజీ భక్తులను ఆశీర్వదించారు. – శ్రీకాకుళం కల్చరల్

అక్రమ కేసులకు భయపడేది లేదు


జయరాం విడుదల అనంతరం పాతపట్నం సబ్ జైలు బయట మాట్లాడుతున్న పేరాడ తిలక్

టెక్కలి: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడేది లేదని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. ఇటీవల నందిగాంకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జద్యాడ జయరాంపై అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మదన్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అరెస్టు చేసి జయరాంను రిమాండ్‌కు తరలించారు. ఈ క్రమంలో జయరాం పై అక్రమ కేసులు నమోదు చేశారంటూ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ సాయంతో కుటుంబ సభ్యులు న్యాయ స్థానాన్ని ఆశ్రయించి పోరాటం చేశారు. దీంతో జయరాంకు బెయిల్ మంజూరు కావడంతో శుక్రవారం పాతపట్నం సబ్ జైలు నుంచి విడుదలయ్యారు. అనంతరం తిలక్ మాట్లాడుతూ టెక్కలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను అణచివేయడానికి మంత్రి అచ్చెన్నాయుడు అండతో టీడీపీ కార్యకర్తలు కావాలనే తగాదాలు సృష్టిస్తూ పోలీసులతో తప్పుడు కేసులు నమోదు చేయిస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలో ప్రతి ఒక్క కార్యకర్తకు అండగా ప్రజల పక్షాన పోరాటం చేస్తామని తిలక్ పేర్కొన్నారు. ఆయనతో పాటు నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, నాయకులు కె.బాలకృష్ణ, ఎ.విష్ణు, ఎ.రాహుల్, ఎ.లోకనాథం, చిన్ని జోగారావు, టి.బలరాంతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఉద్దానంలో ఎలుగు హల్‌చల్

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దాన ప్రాంతంలో గల అక్కుపల్లిలో ఎలుగు హల్ చల్ చేసింది. జీడి తోట నుంచి గ్రామంలోకి భల్లూకం ప్రవేశించడంతో వీధి కుక్కలు వెంటాడాయి. దీంతో ఎలుగు గ్రామ వీధుల్లో పరుగులు తీస్తూ గ్రామంలో ఉన్న అంబికాదేవి అమ్మవారి ఆలయంలో ప్రవేశించేందుకు ప్రయత్నం చేసింది. ఆలయానికి తలుపులు వేయడంతో వీలు లేక అక్కడి నుంచి జారుకుంది. ఎలుగును చూసిన వీధికుక్కలు అరవడంతో ఇళ్లలో ఉన్నవారు బయటకు వచ్చి చూసే సరికి ఎలుగు కనించడంతో భయభ్రాంతులకు గురయ్యారు. రాత్రి సమయంలో అడుగు బయట పెట్టాలంటే భయమేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

16 కేజీల గంజాయి పట్టివేత


వివరాలు వెల్లడిస్తున్న సీఐ చిన్నంనాయుడు, ఎస్సై రవివర్మ

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి గుజరాత్‌కు 16 కేజీల 230 గ్రాముల గంజాయిని అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించిన ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు సీఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. ఇచ్ఛాపురంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా నువాసయి ధోబపల్లి గ్రామానికి చెందిన హరిగౌడ, చింగుడిగాయి గ్రామానికి చెందిన రాకేష్ పఢియాలిలు అదే కాంచన గ్రామంలో గంజాయి కొనుగోలు చేశారు. అక్కడి నుంచి గుజరాత్‌లో బాల అనే వ్యక్తికి ఇచ్చేందుకు శుక్రవారం బయలుదేరగా కవిటి మండలం కొజ్జిరి గ్రామం వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తనిఖీల్లో కవిటి ఎస్ఐ రవివర్మ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'పోయాం మోసం'పై ఇంటెలిజెన్స్ ఆరా!

సాక్షి ఎఫెక్ట్...

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో దినసరి వేతనదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూళ్లు చేసిన రిటైర్డ్ ఉద్యోగి (గ్రేడ్-2 ఈవో) వ్యవహారంపై ఇంటెలిజెన్స్ విభాగం ఆరా తీసింది. ఈమేరకు శుక్రవారం సాక్షిలో ప్రచురించిన 'పోయాం మోసం' కథనానికి ఉన్నతాధికారులు స్పందిస్తూ చర్యలకు దిగారు. ఏకంగా ఐఏఎస్ అధికారి పేరు చెప్పి డబ్బులు వసూళ్లు చేయడాన్ని రాష్ట్ర ప్రభుత్వం కూడా సీరియస్‌గా పరిగణనలోకి తీసుకుందని సమాచారం. ఈ మేరకు ఇంటిలిజెన్స్ పోలీసుల బృందం శుక్రవారం అరసవల్లిలో కొందరు దినసరి వేతనదారులతో మాట్లాడి ఏం జరిగిందన్న కోణంలో వివరాలు సేకరించారు. ఇంటెలిజెన్స్ ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందం స్థానిక సన్‌రైజ్ హోటల్‌లో సదరు రిటైర్డ్ ఉద్యోగి రాకపోకలను, అక్కడే బస చేసిన దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ సత్యనారాయణ రూంలోకి వెళ్లే దృశ్యాలను సీసీ కెమెరాల ఫుటేజీను పరిశీలించారు. తదుపరి విచారణను కొనసాగించనున్నట్లు తెలుస్తోంది. ఇదిలావుంటే సదరు రిటైర్డ్ ఉద్యోగి మాత్రం తమ బంధువైన రాష్ట్ర కమిషనర్ ఇంకా విధుల్లోనే ఉన్నారని.. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ది తమదీ ఒకే కులమని.. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కూడా మాకు సొంత బంధువని.. మరో ఐదునెలల పాటు సత్యనారాయణే కమిషనర్‌గా ఉండేలా లాబీయింగ్ జరుగుతోందంటూ కొందరు దినసరి వేతనదారుల వద్ద చెబుతున్నట్లు తెలిసింది. వేతనదారులు మాత్రం తమ డబ్బులు తమకు ఇచ్చేయాలని, లేదంటే పోలీసు కేసు నమోదు చేసి ఆలయం ముందు ధర్నాకు దిగుతామని హెచ్చరించినట్లు సమాచారం.

26న బైక్ ర్యాలీ


సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలు, లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా శ్రీకాకుళంలో ఈ నెల 26న చేపట్టనున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీలు పిలుపునిచ్చాయి. శ్రీకాకుళం సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, ఉద్యోగులు కార్మికులు శ్రీకాకుళం ఏడు రోడ్ల జంక్షన్‌కు చేరుకుని ర్యాలీలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సింహాచలం, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.ప్రసాదరావు, ఏఐటీయూసీ జిల్లా గౌరవ సలహాదారులు చిక్కాల గోవిందరావు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీపాన.వెంకటరావు, సీఐటీయూ నాయకులు ఎ.సత్యం, ఆర్.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ కార్మికుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న గ్రానైట్ కార్మికులు


టెక్కలి: క్వారీల్లో పనిచేస్తున్న గ్రానైట్ కార్మికుల భద్రత చట్టాలను పటిష్టంగా అమలు చేసేలా అధికారులు చొరవ తీసుకోవాలని జిల్లా గ్రానైట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎన్.షణ్ముఖరావు డిమాండ్ చేశారు. శుక్రవారం టెక్కలి సీఐటీయూ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వారీల్లో కార్మికులకు శ్రమ దోపిడీ చేస్తున్నారని చెప్పారు. మధుకాన్, ఎంటర్‌ప్రైజెస్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ తదితర కంపెనీల్లో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు, ఇతర అలవెన్స్‌లు చెల్లింపులో అలసత్వం వహిస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే కార్మికుల భద్రతతో పాటు హక్కులు అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.కృష్ణారావు, కె.మధుసూదనరావు, రాజారావు, సూర్యనారాయణ, అప్పారావు, ఉమాపతి, పట్నాయక్ రామారావు పాల్గొన్నారు.

పూండిలో దొంగలు హల్‌చల్

- బంగారం షాపుల్లో 9.8 కిలోల వెండి, 9 తులాల బంగారం చోరీ


బంగారం షాపులో చోరీ జరుగుతున్న సీసీటీవీ ఫుటేజీ

వజ్రపుకొత్తూరు: మండలంలో ప్రధాన వ్యాపార కేంద్రం పూండిలో గురువారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. బంగారం షాపులే టార్గెట్‌గా బీభత్సం సృష్టించారు. కట్టర్లు, పదునైన ఆయుధాలు తీసుకుని షాపుల తాళాలను ధ్వంసం చేసి చోరీకి పాల్పడ్డారు. స్థానికులు మేల్కొనే లోపే రూ.20 లక్షలు విలువైన, 9.8 కిలోల వెండి, 9 తులాల బంగారం సొత్తును ఎత్తుకెళ్లారు. చోరీ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. పూండి బస్టాండ్ రోడ్డు కూడలిలో ఉన్న రవికిరణ్ జ్యూయలర్స్ వద్దకు గురువారం అర్ధరాత్రి 2.07 గంటలకు ఏడుగురు దొంగలు చేరుకున్నారు. తాళాలు ధ్వంసం చేసి షట్టర్ హుక్‌లను పగులగొట్టి షాపులో ఉన్న 9.8 కిలోల వెండి, 9 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. వీటి విలువ దాదాపు రూ.20 లక్షలు వరకు ఉంటుంది. అనంతరం ఆర్‌కే జ్యూయలర్స్ షాపు తాళాలు పగులగొట్టి షట్టర్ తెరిచే లోపే స్థానికుల అలజడి రేగడంతో అక్కడినుంచి జారుకున్నారు. పక్కనే ఉన్న గోపాల్ చెరువు గట్టు వద్దకు చేరుకుని సొత్తు సంచుల్లో వేసి వాటి తాలూకా ఖాళీ కవర్లు, డొక్కులను విసిరేసి పరారయ్యారు. ఉదయం షాపు తెరిచి ఉండడంతో యజమాని దున్న రవికుమార్ చోరీకి గురైనట్లు గమనించి వజ్రపుకొత్తూరు ఎస్ఐ బి.నిహార్‌కు సమాచారం అందించారు. ఎస్ఐతో పాటు కాశీబుగ్గ రూరల్ సీఐ ఎం.తిరుపతి, డీఎస్పీ వి.వెంకట అప్పారావు ఘటనా స్థలాన్ని పరిశీలించి వేలిముద్రలు, సీసీటీవీ ఫుటేజీని సేకరించారు. బాధితుడు రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తిరుపతి తెలిపారు.


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం